నిర్మించారు.. వదిలేశారు..



కొత్తపల్లి(హెచ్)లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు

నార్నూర్, మే 1 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొత్తపల్లి(హెచ్), మలేపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు లక్షణంగా వదిలేశారు. గ్రామాల్లో సేకరించిన చెత్తను డంప్‌యార్డుకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉంది. మండల, పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త సేకరణతోపాటు సేంద్రియ ఎరువుల తయారి కనిపించడం లేదు. వేల రూ పాయలతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రామాల్లో పర్యవేక్షిస్తూ చెత్త సేకరణతో పాటు సెగ్రిగేషన్ షెడ్డుల్లో సేంద్రియ ఎరువు తయారు చేసేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మలేపూర్‌లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్డు

ఎప్పుడు పడుతాయో తెలియదు..

వెంగ్వాపేట్‌లో కింద పగుళ్లు తేలి ఉన్న విద్యుత్ స్తంభం

నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలోని విద్యుత్ స్తంభం కిందిభాగం పగుళ్లు వచ్చి సిమెంట్ ఊడిపోతుండడంతో ఎప్పుడు పడుతుందోనని కాలనీవాసులు, రోడ్డునపోయే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. అయితే విద్యుత్ స్తంభం కింద పగుళ్లు వచ్చి ఊడిపోయి ఉండడంతో విద్యుత్ తీగలు పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. స్తంభం కింద పడకముందే కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. - సోన్, మే 1

విద్యార్థులు మానసికంగా ఎదగాలి

ముథోల్, మే 1 : విద్యార్థులు మానసికంగా ఎదగాలని ఎం ఈవో రమణ రెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును ముథోల్, ఆష్టా గ్రామాల్లో ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



బోథ్: లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, మే 1: బోథ్ నియోజకవర్గంలోని బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని గిరిగామ గ్రామానికి చెందిన భూమన్నకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.2 లక్షల విలువ గల ఎల్‌వోసీని బోథ్ ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉత్తమ్ వాడ్గోరే, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

బోథ్, మే 1: బోథ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి కింద మంజూరైన చెక్కులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.2,48,000 విలువ గల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయిని కనుమరుగు చేస్తాం

- 12 కిలోల డ్రైగంజాయి..
  181 గంజాయి మొక్కలు స్వాధీనం..
- 56 మంది నిందితుల అరెస్టు

ఎదులాపురం, మే 1 : గంజాయిని ఆదిలాబాద్ జిల్లాలో కనుమరుగు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గంజాయి వర్తకదారులు, పండించే వారు, వినియోగదారులను ఉక్కు పాదంతో అణచివేస్తామని హెచ్చరించారు. గంజాయి పండిస్తే ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధిని రాకుండా యంత్రాంగానికి సిఫార్సు చేస్తామని తెలిపారు. గత నెల 10వ తేదీ నుంచి ఇప్పటివరకు 34 గంజాయి కేసులు నమోదయ్యాయని, ఇందులో 56 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇప్పటివరకు నమోదైన కేసులలో 12 కిలోల డ్రై గంజాయి, 181 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నాం. వీటి విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.23,21,550 ఉంటుందని తెలిపారు. మాదక ద్రవ్యాల సమాచారం 8712659973 వాట్సాప్ నంబర్ ద్వారా తెలుపాలని సూచించారు.

ఉచిత తాగునీటి ట్యాంకర్ సరఫరా ప్రారంభం

ఎదులాపురం, మే 1: ఆదిలాబాద్‌లో నీటి సమస్య అధికంగా ఉందని తన దృష్టికి వచ్చిందని, ప్రజల సౌకర్యార్థం తాగునీటి ట్యాంకర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని సామాజికవేత్త ముడుపు మౌనిశ్ రెడ్డి అన్నారు. గురువారం దస్నాపూర్‌లో ఉచిత మంచి నీటి ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మౌనిశ్ రెడ్డి మాట్లాడుతూ 20 వేల కెపాసిటి గల వాటర్ ట్యాంక్‌ను అందుబాటులో తీసుకువచ్చామన్నారు. ఎక్కడైన నీటి సమస్య ఉంటే నేరుగా ఫోన్ చేస్తే ఉచితంగా నీటిని అందిస్తామన్నారు. ముందుగా కేఆర్‌కే కాలనీలో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భగవన్‌రావ్, మాజీ కౌన్సిలర్ కృష్ణయాదవ్, అనిల్, కోరెడ్డి తిరుపతి, బండారి దేవన్న, సురేందర్ రెడ్డి, ఆశన్న యాదవ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

తాంసి, మే 1: మండలంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతామని ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. గురువారం హస్నాపూర్ గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లలో కమిటీ సభ్యులు అనర్హులను ఎంపిక చేస్తే సమాచారం ఇవ్వాలన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి లావణ్య, సిబ్బంది ఉన్నారు.

కుభీర్ ఎంపీడీవోగా సాగర్‌రెడ్డి

కుభీర్, మే 1: నిర్మల్ జిల్లా కుభీర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో) గా ఎం సాగర్‌రెడ్డి గురువారం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన నవనీత్ కుమార్ బుధవారం ఉద్యోగ విరమణ పొందడంతో మామడ ఎంపీవోగా పని చేస్తున్న సాగర్‌రెడ్డిని కుభీర్ ఎంపీడీవోగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ముందుగా ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు. ఇక్కడ ఎంపీవో మోహన్‌సింగ్, ఎస్ఏ రహమాన్, సిబ్బంది ఉన్నారు.

క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

కుభీర్: సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కుభీర్, ఏప్రిల్ 1 : విద్యార్థులు సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని హెచ్ఎం సాయన్న కోరారు. గురువారం నిర్మల్ జిల్లా కుభీర్‌లోని జడ్పీ హైస్కూల్‌లో యంగ్ ఇండియా సమ్మర్ కాంపును ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 9వ తరగతి ఈ నెల 15 వరకు క్రీడలు, క్రాఫ్ట్, ఆర్ట్, స్పోకెన్ ఇంగ్లిష్, మోటివేషన్ క్లాసులు ఈ క్యాంపులో విద్యార్థులకు నిర్వహించబడుతాయన్నారు. హెచ్ఎం జే సాయన్న, ఉపాధ్యాయులు సట్ల గంగాధర్, పీడీ క్రాంతి, క్యాంపు ట్యూటర రాథోడ్ సందీప్, క్రాఫ్ట్ టీచర్ సాయిశ్యాం పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం

ఖానాపూర్, మే 1 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా యూత్ అండ్ స్పోర్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజురా సత్యం గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ కిరణ్‌కుమార్, కోచ్‌లు శేక్ ఇర్ఫాన్, రిజ్వాన్, రాము, ఆరిఫ్‌ఖాన్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

విజయం సాధించాలంటే పట్టుదల అవసరం

నిర్మల్ అర్బన్, మే 1 : విజయం సాధించాలంటే పట్టుదల ఎంతో అవసరమని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ కార్యాలయంలో ఆమె అభినందించారు. ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల ఖానాపూర్‌కు చెందిన జాదవ్ ఈశ్వర్ 561, భూక్యా గౌతమ్ 558 మార్కులు సాధించగా విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అంబాజీ, సీపీవో జీవరత్నం, భూక్యా రమేశ్ పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

ఎదులాపురం, మే 1: ఆదిలాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ మున్సిపల్ అధికారులకు సూచించారు. గురువారం వార్డు ఆఫీసర్లతో మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి పథకంపై చర్చించారు. పేదవారికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనర్హులు ఉంటే వారిని తొలగించి అర్హులను ఎంపిక చేయాలని ఆదేశించారు.

ఘనంగా మే డే

ఎదులాపురం: జెండా ఎగురవేస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గిమల స్వామి

నమస్తే నెట్‌వర్క్, మే 1 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు ఊరూరా ర్యాలీ తీసి ఎర్ర జెండాలను ఎగురవేశారు. చికాగో అమరవీరుల పోరాట ఫలితంగా సాధించిన అనేక హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని, కార్మికుల సమస్యలపై అన్ని వర్గాల వారు సంఘటితంగా పోరాడాలని పలువురు సూచించారు. కార్మిక వ్యతిరేక చట్టాలను సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్, సీపీఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, నిర్మల్ సీనియర్ సివిల్ జడ్జి రాధిక, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రాజన్న, ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిత, సీఐటీయూ నిర్మల్ జిల్లా నాయకురాలు సుజాత, ఏఐటీయూసీ, సీపీఐ, సీఐటీయూ, సీపీఎం, బీడీ కామగార్ యూనియన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

నేరడిగొండ, మే 1 : ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా ఎడ్లను తరలిస్తున్న కంటైనర్ వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. అక్కడ కంటైనర్‌ను తనిఖీ చేయగా అందులో 29 ఎద్దులను కుక్కి తీసుకెళ్తున్నారు. ఇవి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నట్లు తెలిపారు. వీటిని అక్రమంగా తరలిస్తున్న ఆరుగురు వరదరాజులు, అలెక్స్ పాండ్యన్, మురుగన్., హరిరంజిత్ కుమార్, జుబేర్‌అలీ(తమిళనాడు),ఇమ్రాన్ (మహారాష్ట్ర) కు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం, మే 1 : టీ తాగే వచ్చేలోపు ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన ఆదిలాబాద్‌లో చోటు చేసుకుంది. ఏప్రిల్ 18వ తేదీన అంబేద్కర్ నగర్‌కు చెందిన కాంబ్లే గజానన్ ద్విచక్ర వాహనం టీఎస్ 01ఈఎల్ 1930 కలెక్టర్ చౌక్ టీ హోటల్ ఎదుట వద్ద పార్కింగ్ చేశారు. తిరిగి వచ్చి చూసేసరికి అక్కడ ద్విచక్ర వాహనం కనిపించలేదు. గురువారం వన్ టౌన్‌లో ఫిర్యాదు చేయగా ద్విచక్ర వాహనం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు

ఎదులాపురం, మే 1: తాకట్టు పెట్టుకున్న ఇంటికి సంబంధించిన డబ్బులను బాధితులు చెల్లించినప్పటికీ ఆ ఇంటిను స్వాధీనం చేయకుండా మోసం చేసిన వ్యక్తిపై గురువారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఖుర్షిద్ నగర్‌కు చెందిన షేక్ ముజాహిద్, అజ్మీరాబేగం హైదరాబాద్‌కు చెందిన ఎండీ సోహెల్ (గతంలో ఇక్కడే ఉండేవాడు). వేర్వేరుగా రూ.5లక్షల చొప్పున 2023లో అప్పు తీసుకున్నారు. ఇందుకుగాను నిందితుడు వారి ఇళ్లను తాకట్టు పెట్టుకున్నాడు. బాధితులు ఇద్దరు పూర్తి మొత్తం వడ్డీతో సహా చెల్లించినప్పటికీ సదరు ఇళ్లను నిందితుడు స్వాధీనం చేయడం లేదని వారు గురువారం ఫిర్యాదు చేయగా కేసులు నమోదు చేశామన్నారు.

గంజాయి తాగుతున్న నలుగురిపై ..

ఎదులాపురం, మే 1 : గంజాయి తాగుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువు కట్ట సమీపంలో అంబేద్కర్ నగర్ తోరత్ ప్రేతమ్, సూర్యవంశీ సాయి అలీయస్ సాయినాథ్, రవీంద్ర నగర్‌కు చెందిన ఠాక్రే రోషన్, ఖానాపూర్ కాలనీ మంతెన సృజన్ కుమార్ గంజాయి తాగుతుండగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 5 గ్రాముల గంజాయి, రెండు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ఇసుక రాయల్టీ తీసుకున్న వీడీసీ సభ్యులపై ..

జైనథ్, మే 1: ఇసుక రాయల్టీ తీసుకున్న పెండల్‌వాడ, సాంగ్వి వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. మండలంలోని పెండల్‌వాడ గ్రామంలో ఏప్రిల్ 13వ తేదీన గ్రామ శివారులో పెన్‌గంగ నుంచి ఇసుక తీసుకుపోవడానికి వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లకు వీడీసీ సభ్యులు భూమారెడ్డి అతని సోదరుడు రామ్‌రెడ్డి మరి కొంతమంది సభ్యులు డ్రైవర్ల వద్ద రూ.500 రాయల్టీ అక్రమంగా తీసుకోవడమే కాకుండా వారిని దూషిస్తూ బెదిరించారు. అలాగే సాంగ్వి గ్రామంలో ఇసుక తరలింపులో వసూలు పాల్పడుతున్న అశోక్ మరి కొంత మందిపై ట్రాక్టర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జైనథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

నేరడిగొండ, మే 1 : నేరడిగొండలోని హర్యాన పంజాబీ దాబా వెనుక గల ఖాళీ ప్రదేశంలో పేకాటాడుతున్న నలుగురిని పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వారి వద్ద నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, రూ.13,560 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దు

మాట్లాడుతున్న జిల్లా పౌరశాఖల అధికారి కోమల్ రెడ్డి

దస్తురాబాద్, మే 1 : రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని జిల్లా పౌరశాఖల అధికారి కోమల్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా దస్తురాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో గురువారం అధికారులతో, ఐకేపీ, పీఏసీఎస్ నిర్వాహకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తూకం తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తప్పనిసరిగా 41.5 కేజీల ధాన్యాన్ని తూకం వేయాలన్నారు. తూకంలో అవకతవకలు జరిగితే ఆ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు రోజుల క్రితం రైతులను రైస్ మిల్లుల యాజమానులు వేధిస్తున్నారంటే చేసిన ఆరోపణలు నిరాధారమైనవి అన్నారు. రైతులను అయోమయానికి గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గన్ని సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అన్ని రకాల మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు వాతావరణ మార్పులపై సమాచారాన్ని ఇవ్వాలని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, డిప్యూటీ తహసీల్దార్ యాదవ రావ్, ఏఈవో తిరుపతి, ఏపీఎం గంగాధర్, రెవెన్యూ, ఆర్ఐలు రచన, ఆర్తీ, సీసీలు, ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి
- కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

ఎదులాపురం, మే 1 : మావోయిస్టుల ఏరివేత పేరిట మిలటరీ, పారా మిలటరీ బలగాలు ఆదివాసులపై అత్యాచారాలు, హత్యలు చేస్తున్నారని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేశ్ ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిరసన అనంతరం గేటుకు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా గణేశ్ మాట్లాడుతూ.. మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి ఆదివాసులను కాపాడాలని కోరాడు. దాడులు ఆపని పక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిర, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్, డివిజన్ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, ఆదివాసీ యువజన సంఘం నాయకులు గేడం విష్ణు, వెడ్మ ముకుందరావ్, కుడుమేత జంగు, ఆత్రం భుజంగరావ్, దుర్వ జుగదిరావ్, చిక్రం సోము పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆదివాసీ నాయకులు

ఆశ్రమాల మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలి

మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్, మే 1: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమాల్లో సాగుతున్న మరమ్మతులు త్వరగా పూర్తిచేయాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఇంజినీరింగ్ డీఈ, ఏఈలతో సమావేశం నిర్వహించారు. వేసవి సెలవులలో ఆశ్రమ పాఠశాల గేట్ల మరమ్మతులు భోజన శాలలు ఎంత వరకు వచ్చాయని తెలుసుకున్నారు. అలాగే వాచ్‌మెన్ గదులు కూడ నిర్మించాలని సూచించారు. అదనపు గదుల నిర్మాణం, అంగన్‌వాడీ, మోడల్ స్కూల్, మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంక్, డార్మెంటరి గదులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనులను సమీక్షించారు. సమావేశంలో ఈఈ తానాజీ, డీఈ శివప్రసాద్, డీఈ సతీశ్, ఏఈలు పాల్గొన్నారు.

గురుకులాల్లో 99 శాతం ఉత్తీర్ణత

ఉట్నూర్, మే 1: గురుకులాల్లో పదో తరగతి ఫలితాలలో 99 శాతం ఉత్తీర్ణత సాధించడం హర్షణీయమని ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం తన కార్యాలయంలో గురుకులం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం 96.33 ఫలితాలు ఉన్నాయన్నారు. వాటిని ఇప్పుడు 99 శాతంగా రావడానికి ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, గురుకుల సిబ్బంది, విద్యార్థుల కృషి కారణమన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12 గిరిజన బాల, బాలికల గురుకులాల్లో బాలికలు 595 మంది పరీక్షలు రాయగా 591 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. బాలురు 260 మంది పరీక్ష రాయగా 253 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మొత్తంగా 855 మందిలో 844 ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేశ్, జ్ఞానేశ్వర్, సుంగులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ

కుభీర్: ఏప్రిల్ 1: నిర్మల్ జిల్లా కుభీర్ గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మిత్ర మండలి ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. 'మే డే' పురస్కరించుకుని గురువారం పంచాయతీ కార్యాలయంలో కార్మికులను శాలువా, పూలమాలలతో సత్కరించి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షులు ప్యాట లక్ష్మణ్, సట్ల గంగాధర్, బీఆర్ఎస్ మండల నాయకులు, ఉద్యమకారుడు పుప్పాల పీరాజీ, కారోబారి పానాజీ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల విలువ గొప్పది

ఉట్నూర్, మే 1: సమాజంలో కార్మికుల విలువ చాలా గొప్పదని ఉట్నూర్ ఎస్ఐ మనోహర్, రిటైర్డ్ ఈఈ రాథోడ్ భీంరావ్, అజయ్ ఫౌండేషన్ చైర్మన్ అజయ్ అన్నారు. గురువారం మే డేను పురస్కరించుకుని ఉట్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులను సన్మానించారు. అనంతరం వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

కవి.. కార్మికుల వైపే

తాంసి(భీంపూర్), మే 1: కవి, రచయిత కార్మిక, శ్రామిక వర్గాల కష్టనష్టాలను తమ రచనల్లో చెబుతూ యాజమాన్యాలు, పాలకుల ద్వారా న్యాయం జరిగేలా తమవంతు బాధ్యత నిర్వర్తించాల్సి ఉంటుందని ప్రముఖ కవి డాక్టర్ ఉదారి నారాయణ గుర్తు చేశారు. ఆదిలాబాద్ గిజిటెడ్ నంబర్-1 పాఠశాలలో గురువారం మే డే సందర్భంగా ఐతారం ముచ్చట్లు ఆధ్వర్యంలో ప్రత్యేక కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు అల్లూరి భూమన్న, చరణ్, నర్సింహులు, బీ బాబన్న, లక్ష్మీనారాయణ, కొండా సాయిప్రియ, త్రివేణి యాదవ్, శైలజ, అరుణ, రిజ్వాన్, గంగన్న, వినయ్, సూర్యవరప్రసాద్, అప్సరాఖాన్, ప్రసాద్, నిత్యాన్వేషి, పురుషోత్తం పాల్గొన్నారు.

బాధితునికి పరామర్శ

బోథ్, మే 1: ఆదిలాబాద్ జిల్లా బోథ్‌లోని సాయి నగర్ కాలనీకి చెందిన తొడసం తులసీరామ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గురువారం బీఆర్ఎస్ నాయకుడు మల్లెపూల సుభాష్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మడావి భీంరావ్, కాలనీవాసులు భీంరావ్, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

ముథోల్, మే 1 : నిర్మల్ జిల్లా ముథోల్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో మహ్మద్ అజార్ (30) మృతి చెందినట్లు ఎస్ఐ సంజీవ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అజార్ తన దుకాణంలో ద్విచక్రవాహనాన్ని కడుగుదామని మోటర్ ఆన్ చేయబోతుండగా షాక్ తగిలింది. హుటాహుటిన ముథోల్ దవాఖానకు తరలించే క్రమంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా గర్భిణీ ..

భైంసా, మే 1 : నిర్మల్ జిల్లా భైంసాలోని పాండ్రిగల్లికి చెందిన తబస్సుమ్ (27) గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన షేక్ ఫాజిల్‌తో తబస్సుమ్‌కు 8 ఏళ్ల కిందట వివాహం కాగా వీరికి ఇద్దరు సంతానం. ప్రస్తుతం ఏడో నెల గర్భిణిగా ఉంది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఇంట్లో కాలుజారి పడి తీవ్రంగా గాయపడింది. స్థానిక ప్రభుత్వ ఏరియా దవాఖానకు తీసుకెళ్లగా మృతి చెందిందని భర్త పాజిల్ భార్య తరపున కుటుంబీకులకు సమాచారమిచ్చారు. దీంతో వారు దవాఖానకు చేరుకుని తన కూతురు మృతిపై అనుమానాలున్నాయని, ఈ మేరకు మృతురాలి తల్లి షేక్ అలీమా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఖానాపూర్, మే 1: ప్రేమ విషయమై జీవితంపై విరక్తి చెంది నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణం శివాజీనగర్‌కు చెందిన జక్కుల తరుణ్(24) గురువారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంలో మానసికంగా బాధపడుతూ ఉంటున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రి ఇందూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య